# అయ్యయ్యో.. అమిత్ షా

## జువాలజీ షాకు ఆర్థికం ఏమి తెలుసు!

### హాట్ టాపిక్‌గా సుబ్రమణ్యన్ స్వామి 'ఎక్స్' పోస్ట్




న్యూఢిల్లీ, అక్టోబర్ 12: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. భారత జీడీపీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నదని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రకటించడమే ఇందుకు కారణం. అయితే దీనిపై సొంత పార్టీకి చెందిన సుబ్రమణ్యన్ స్వామి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. ఇప్పుడిది హాట్ టాపిక్‌గా మారింది. నిజానికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారతీయ కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) అందించిన వివరాల ప్రకారమే ఐఎంఎఫ్ ఈ ప్రకటనలు చేస్తుంది. అయితే పాపం అమిత్ షాకు ఇది కూడా తెలియట్లేదని, బహుశా జంతు శాస్త్రంలో పట్టభద్రులు కావడం వల్లేనేమో ఆర్థిక శాస్త్రంపై అవగాహన అంతంతమాత్రంగా ఉండిపోయిందన్నట్టు సదరు పోస్ట్‌లో కనిపిస్తున్నది. దీంతో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యన్ స్వామి చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఎక్స్‌లో పెద్ద ఎత్తున ట్రెండింగ్ అవుతున్నది. గురువారం రాత్రి నాటికే దీన్ని 5 లక్షల మందికిపైగా చూసినట్టు తెలుస్తున్నది.

# 16వేల కోట్ల పెట్టుబడులు

## వచ్చే ఆరేండ్లలో వ్యాపార విస్తరణ కోసం పెట్టనున్న కంట్రోల్‌ఎస్

### హైదరాబాద్ డాటా సెంటర్ల విస్తరణ, కొత్తగా నియామకాలు?






న్యూఢిల్లీ, అక్టోబర్ 12: వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే ఆరేండ్లలో కంట్రోల్‌ఎస్ డాటాసెంటర్స్ దాదాపు రూ.16,000 కోట్ల పెట్టుబడుల్ని (2 బిలియన్ డాలర్లు) పెట్టాలని యోచిస్తున్నది. 2030కల్లా తమ హైపర్‌స్కేల్ డాటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోవడానికి, కార్బన్ న్యూట్రల్‌గా అవతరించడానికి ఈ పెట్టుబడులను వినియోగించుకోవాలని చూస్తున్నది. ఈ మేరకు గురువారం సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో కంట్రోల్‌ఎస్‌కు 234 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12 డాటా సెంటర్లున్నాయి. హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా, లక్నో, పాట్నాల్లో కంట్రోల్‌ఎస్‌కు ఈ డాటా కేంద్రాలున్నాయి. కాగా, భారత్, కొన్ని ఆగ్నేయాసియా దేశాల్లో తమకు ఇప్పటికే ఉన్న హైపర్ స్కేల్, ఎడ్జ్ డాటా సెంటర్ల సామర్థ్యాన్ని పెంచుకోవడం, కొత్తవి ఏర్పాటు చేయడం ద్వారా సుమారు మరో 350 మెగావాట్ల సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవాలనుకుంటున్నట్టు, అందులోభాగంగానే ఈ కొత్త పెట్టుబడులని ఓ ప్రకటనలో కంట్రోల్‌ఎస్ స్పష్టం చేసింది. దీంతో హైదరాబాద్‌లోని డాటా సెంటర్ల విస్తరణ, ఇక్కడ కొత్తగా నియామకాలకు ఆస్కారముంటున్నది.

#### వెయ్యి ఉద్యోగాలు

రాబోయే ఆరేండ్లలో తాము పెట్టబోయే పెట్టుబడులకుతోడు వెయ్యికిపైగా ఉద్యోగులను తీసుకోనున్నట్టు కంట్రోల్‌ఎస్ చెప్పింది. 'మూడు దేశాల్లోని 153 మెగావాట్ పీక్ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టనున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా 2.5 లక్షల మెగావాట్ అవర్స్ విద్యుదుత్పత్తి అవుతుంది. ఇందులో మహారాష్ట్రలోని మా సంస్థకు చెందిన 145 మెగావాట్ పీక్ సోలార్ ప్రాజెక్టు కూడా ఉన్నది. 2025కల్లా మరో 300 మెగావాట్ పీక్ సామర్థ్యముండే ప్రాజెక్టులను నెలకొల్పనున్నాం' అని కంట్రోల్‌ఎస్ తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా పునరుత్పాదక శక్తిని మించి బహుళార్ధ వ్యూహాలతో నెట్ జీరో లక్ష్యాలను సాధించాలని కంట్రోల్‌ఎస్ చూస్తున్నది. మరింత పొదుపుగా నీటిని వినియోగించాలని చూస్తున్న కంపెనీ.. తమ అన్ని డాటా సెంటర్ల వద్ద 100 శాతం రీసైకిల్డ్ వాటర్ వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు అత్యాధునిక రీసైక్లింగ్ టెక్నాలజీలను వాడుకోనున్నట్టు సదరు ప్రకటనలో కంట్రోల్‌ఎస్ వివరించింది.

#### 80,000 కోట్లు

*వచ్చే మూడేండ్లలో డాటా సెంటర్లు రూ.80,000 కోట్ల పెట్టుబడుల్ని (10 బిలియన్ డాలర్లు) ఆకట్టుకొనే అవకాశాలున్నాయని దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ, ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొల్లీర్స్ ఇండియాల నివేదిక ఒకటి అంచనా వేసింది. ఇంటర్నెట్ యాక్సెస్‌లో వేగంగా పెరిగిన వృద్ధితో పాటు పెరుగుతున్న క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం, ఐవోటీ, 5జీ, ప్రభుత్వ డిజిటలైజేషన్ కార్యక్రమాలతో స్టోరేజీ సామర్థ్యానికి డిమాండ్ ఊపందుకున్నట్టు 'ఇండియా డాటా సెంటర్స్: ఎంటరింగ్ క్వాంటమ్ గ్రోత్ ఫేజ్' పేరుతో తాజాగా విడుదల చేసిన రిపోర్టులో సీఐఐ-కొల్లీర్స్ వివరించాయి. అలాగే ఈ రంగంలో 2020 నుంచి భారత్‌లోకి దాదాపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశాయి. గ్లోబల్ డాటా సెంటర్ ఆపరేటర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ ఈ పెట్టుబడులు పెట్టాయి. ఇదిలావుంటే హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణెల్లో డాటా సెంటర్ సామర్థ్యం ఈ ఏడాది ఆగస్టు నాటికి 819 మెగావాట్లుగా ఉన్నదని, 1.1 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో స్టాక్ వ్యాపించిందని ఈ రిపోర్టు తెలిపింది. దీంతో 2026కల్లా 2.3 కోట్ల చ.అ. పెరుగవచ్చని కొల్లీర్స్ ఇండియా అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే డాటా సెంటర్ మొత్తం సామర్థ్యం సుమారు 1800 మెగావాట్లకు చేరవచ్చన్నది.*

## (24)7.ఏఐలో భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబర్ 12: అంతర్జాతీయ ఇంటెంట్-డ్రైవెన్ కస్టమర్ సొల్యూషన్స్, కాంటాక్ట్ సెంటర్ సేవల సంస్థ (24)7.ఏఐ భారీ స్థాయిలో ఉద్యోగుల సంఖ్యను పెంచుకోనున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరుల్లో ఉన్న సెంటర్లలో సిబ్బంది సంఖ్యను 7 వేలకు పెంచుకుంటున్నది. ప్రస్తుతం ఈ రెండు సెంటర్లలో 4 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లైన చిత్తూరు, తిరుపతి, వైజాగ విజయవాడ, మైసూరు నగరాల్లో ఉన్న ప్రతిభ కలిగిన సిబ్బందిని రిక్రూట్ చేసుకుంటున్నది మొత్తం నియామకాల్లో 40 శాతం వీరినే రిక్రూట్ చేసుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## బీవోఎం వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన, వ్యక్తిగత, గృహ రుణాలపై ఈఎంఐలు అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్ రేటు 8.60 శాతం నుంచి 8.70 శాతానికి చేరుకోనున్నది. పెరిగిన వడ్డీరేట్లు ఇప్పటికే అమలులోకి వచ్చాయి.

# ఆకట్టుకున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,833 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,487 కోట్ల లాభంతో పోలిస్తే 9.9 శాతం అధికమని పేర్కొంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీ కూడా ఇన్ఫోసిస్ మాదిరిగానే ఆదాయ అంచనాల్లో కోత విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 5-6 శాతం మధ్యలో నమోదుకానున్నట్టు గైడెన్స్‌లో పేర్కొంది. గతంలో 6-8 శాతంగా ఉంటుందని అంచనావేసిన సంస్థ..ఈసారికి దీనిని కుదించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 8 శాతం ఎగబాకి రూ.26,672 కోట్లకు చేరుకున్నది. గత త్రైమాసికంలో అన్ని విభాగాలు అంచనాలకుమించి రాణించాయి..ఆపరేటింగ్ మార్జిన్లలో 18.5 శాతం వృద్ధి నమోదైందని కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు.

- గత త్రైమాసికంలో సంస్థ 3.96 బిలియన్ డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకున్నది.
- ఉద్యోగుల వలసలు 14.2 శాతంగా నమోదయ్యాయి. ఏడాది క్రితం నమోదైన 23.8 శాతం కంటే ఇది తగ్గింది.
- ఉద్యోగుల సంఖ్య ఒక్క శాతం తగ్గి 2,21,139కి పరిమితమయ్యారు.
- 27 వేల మంది ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకున్న సంస్థ..ఈ ఏడాది మరో 10 వేల మందిని నియమించుకోనున్నది.

# ఆఫీస్ మార్కెట్‌లో • హైదరాబాద్ హవా

## దేశంలోని ప్రధాన నగరాల్లో రాబోయే ఆఫీస్ స్పేస్‌లో ఇక్కడే ఎక్కువ • సీబీఆర్ఈ తాజా నివేదిక



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ఆఫీస్ మార్కెట్‌లో ఇకపైనా హైదరాబాద్ హవా కొనసాగనున్నది. కార్యాలయ స్థలాలకు హైదరాబాద్‌లో ఉన్నంత డిమాండ్ దేశంలోని ప్రధాన నగరాల్లో మరెక్కడా కనిపించదన్న అంచనాలున్న విషయం తెలిసిందే. ఇందుకు తగ్గట్టుగానే ఈ 2023-2025 కాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో వచ్చే ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్, బెంగళూరు వాటానే 49 శాతంగా ఉండొచ్చని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ అంటున్నది. గురువారం 'ఆఫీస్ మైథ్స్ డీబంక్డ్' పేరుతో సీబీఆర్ఈ దక్షిణాసియా విభాగం ఓ కొత్త నివేదికను విడుదల చేసింది. ఆయా రంగాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)ను అంతర్జాతీయ కార్పొరేట్లు మరిన్ని తీసుకురాబోతున్నారని చెప్పింది. ఇప్పటికే హైదరాబాద్‌లో బెంగళూరు కంటే ఎక్కువగా జీసీసీలు కొలువుదీరబోతున్నాయని ఇటీవలి ఓ నివేదికలో తేలిన సంగతి విదితమే.

#### 165 మిలియన్లకుపైనే..

హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై, ముంబై, కోల్‌కతా నగరాల్లో ఆఫీస్ స్పేస్ మార్కెట్ తీరుతెన్నులపై సీబీఆర్ఈ రిపోర్టు వచ్చింది. ఇందులో 2023-2025లో ఈ ఏడు నగరాల్లో కొత్తగా 165 మిలియన్ చదరపు అడుగులకుపైగా ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రావచ్చని ఉన్నది. 2020-2022లో వచ్చిన ఆఫీస్ స్పేస్ కంటే ఇది అధికం. నాడు 142 మిలియన్ చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ కొత్తగా అందుబాటులోకి వచ్చింది. కాగా, 2020 నుంచి 2022 వరకున్న మూడేండ్ల వ్యవధిలో ఆఫీస్ సప్లై వార్షిక సగటు 17 శాతం పెరిగిందని, భవన పరిమాణం సగటు సైతం 18 శాతం ఎగిసిందని సీబీఆర్ఈ ఈ సందర్భంగా తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ 2023-2025లో ఆఫీస్ సప్లై, భవన పరిమాణంల వార్షిక సగటు మరో 15-18 శాతం పెరుగవచ్చన్నది.

#### 33 మిలియన్లు..

2023-2025లో రాబోయే 165 మిలియన్ చదరపు అడుగులకుపైగా ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్‌లోనే 33 మిలియన్ చదరపు అడుగులు రావచ్చని సీబీఆర్ఈ తెలిపింది. మొత్తం అంచనాలో ఇది 20 శాతానికి సమానం. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 28 మిలియన్ చదరపు అడుగులు (17 శాతం), పుణెలో 19.8 మిలియన్ చదరపు అడుగులు (12 శాతం), చెన్నైలో 18.15 మిలియన్ చదరపు అడుగులు (11 శాతం), ముంబైలో 14.8 మిలియన్ చదరపు అడుగులు (9 శాతం), కోల్‌కతాలో 3.3 మిలియన్ చదరపు అడుగులు (2 శాతం) మేర కొత్తగా కార్యాలయ స్థలాలు రానున్నాయి. అయితే ఈ మూడేండ్లలో బెంగళూరులో అత్యధికంగా 47.8 మిలియన్ చదరపు అడుగుల (29 శాతం) ఆఫీస్ స్పేస్ రాబోతున్నది.

> దేశంలో ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఆకర్షణీయ వృద్ధితో పరుగులు పెడుతున్నది. ఈ క్రమంలోనే 2023-25లో దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ప్రధాన నగరాల మార్కెట్లలోకి కొత్తగా 165 మిలియన్ చదరపు అడుగులకుపైగా కార్యాలయ స్థలం అందుబాటులోకి వస్తుందని అంచనా. భారతీయ ఆఫీస్ రంగానికి దీన్నో శుభసూచకంగా చెప్పవచ్చు.
>
> -అన్షుమన్ మ్యాగజైన్, సీబీఆర్ఈ ఇండియా చైర్మన్

# జీఎమ్మార్ ఏవియేషన్ సైబర్ సెక్యూరిటీ ఫిజిటల్ ల్యాబ్



హైదరాబాద్, అక్టోబర్ 12: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జీఎమ్మార్ ఏవియేషన్ అకాడమీ (జీఎమ్మార్ఏఏ) ఒక వినూత్న సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇన్ఫర్మేషన్ షేరింగ్ అనాలిసిస్ సెంటర్ (ఐఎస్ఏసీ)తో కలిసి ఏవియేషన్ సైబర్ సెక్యూరిటీ ఫిజిటల్ ల్యాబ్‌ను ప్రారంభించినట్టు జీఎమ్మార్ఏఏ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఫిజిటల్ ల్యాబ్ అభివృద్ధికి 10,000 చదరపు అడుగుల స్పేస్‌ను కేటాయించామని, ల్యాబ్‌కు టెక్నాలజీ పార్ట్‌నర్‌గా సైబర్‌రేంజ్, నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఐఎస్ఏసీ వ్యవహరిస్తున్నట్టు జీఎమ్మార్ వివరించింది. సైబర్ సెక్యూరిటీ వృత్తినిపుణులకు, ఫ్రెషర్లను సమగ్ర శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నది. క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీఐఐ)ను సైబర్ దాడుల నుంచి పరిరక్షించే శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నది.

# ముకేశే నంబర్‌వన్

## రెండో స్థానంలో గౌతమ్ అదానీ.. ఫోర్బ్స్ సంపన్న వర్గాల జాబితా విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మళ్లీ తొలి స్థానాన్ని దక్కించుకున్నారు. మొన్నటికి మొన్న హురున్ శ్రీమంతుల జాబితాలో దేశీయ కుబేరుడిగా అవతరించిన ముకేశ్..ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన జాబితాలో కూడా తొలి స్థానం దక్కించుకున్నారు. 2023 ఏడాదికిగాను ఫోర్బ్స్ దేశీయ కుబేరుల జాబితాను గురువారం విడుదల చేసింది. ఈ జాబితాలో ముకేశ్ అంబానీ సంపద 1.5 బిలియన్ డాలర్లు పెరిగి 91.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు తెలిపింది. ఇదే సమయంలో గతేడాది తొలిస్థానంలో నిలిచిన గౌతమ్ అదానీ సంపద కేవలం 129 మిలియన్ డాలర్లు పెరిగి 54.2 బిలియన్ డాలర్లతో రెండో స్థానం సరిపెట్టుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో శివ్ నాడార్, సావిత్రి జిందాల్, సైరస్ పునావాలా, దిలీప్ సంఘ్వీ, కుమార మంగళం బిర్లాలు ఉన్నారు.


మురళీ దివీస్ · రామ్‌ప్రసాద్ రెడ్డి · ప్రతాప్ సీ రెడ్డి · పీపీ రెడ్డి · పీవీ కృష్ణారెడ్డి · జీఎం రావు

### ప్రపంచ కుబేరుల జాబితాలో దేశీయ శ్రీమంతులు

| పేరు | ర్యాంక్ | సంపద (బిలియన్ డాలర్లలో) |
|---|---|---|
| ముకేశ్ అంబానీ | 12 | 91.4 |
| గౌతమ్ అదానీ | 24 | 54.2 |
| శివ్ నాడార్ | 51 | 28.2 |
| సావిత్రి జిందాల్ | 60 | 25.4 |
| సైరస్ పునావాలా | 82 | 20.6 |
| దిలీప్ సంఘ్వీ | 90 | 18.5 |
| కుమార బిర్లా | 96 | 18 |
| రాధాకృష్ణ దామాని | 101 | 17.1 |
| లక్ష్మీ మిట్టల్ | 107 | 15.7 |
| ఉదయ్ కొటక్ | 132 | 13.4 |
| **తెలుగువారు..** | | |
| మురళీ దివీస్ అండ్ కుటుంబం | 415 | 6.5 |
| పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి | 1241 | 2.5 |
| ప్రతాప్ సీ రెడ్డి | 1249 | 2.5 |
| పీపీ రెడ్డి | 1484 | 2 |
| పీవీ కృష్ణా రెడ్డి | 1540 | 1.9 |
| జీఎం రావు | 1607 | 1.9 |

# ఏపీఎల్ అపోలో ప్రచారకర్తగా అమితాబ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: స్టీల్ ఉత్పత్తి సంస్థ ఏపీఎల్ అపోలో..బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌ను ప్రచారకర్తగా నియమించుకున్నది. మూడు దశాబ్దాలకు పైగా మేక్ ఇన్ ఇండియా మంత్రాన్ని జపిస్తున్న సంస్థ..వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి, బ్రాండ్‌కు మరింత గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో బాలీవుడ్ బాద్‌షాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్టు కంపెనీ చైర్మన్, ఎండీ సంజయ్ గుప్తా తెలిపారు. ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న సంస్థకు దేశవ్యాప్తంగా 11 స్టీల్ ఉత్పత్తి ప్లాంట్లు ఉండగా, వీటితో ప్రతియేటా 36 లక్షల టన్ను స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నది.

## మంగళూరు టు హైదరాబాద్ ఇండిగో ఫ్లైట్

హైదరాబాద్, అక్టోబర్ 12: మంగళూరు నుంచి హైదరాబాద్ మధ్య మూడో డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసును ప్రారంభించబోతున్నది ఇండిగో. ఈనెల 19 నుంచి అందుబాటులోకి రానున్న ఈ నూతన సర్వీసుతో ఇరు నగరాల మధ్య నడవనున్న సర్వీసుల సంఖ్య మూడుకి చేరుకోనున్నది. ప్రతిరోజు మంగళూరుకు మధ్యాహ్నం 2.15 గంటలకు చేరుకోనున్న విమాన సర్వీసు తిరిగి 2.35 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరనున్నది. తమిళనాడులోని సేలం నుంచి చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు విమాన సర్వీసులు ఇటీవల ప్రారంభించినది తెలిసిందే.

# ఇన్ఫీ లాభం 6,215 కోట్లు

## రూ.18 మధ్యంతర డివిడెండ్




న్యూఢిల్లీ, అక్టోబర్ 12: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు తగ్గట్టుగానే రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.6,215 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,026 కోట్ల లాభంతో పోలిస్తే 3.1 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6.7 శాతం ఎగబాకి రూ.38,994 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. అనిశ్చిత ఆర్థిక పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఒప్పందాలు భారీగా కుదుర్చుకున్నట్టు, ముఖ్యంగా క్లయింట్లకు నూతన సేవలు అందించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు.

#### గైడెన్స్ నిరాశాజనకం..

ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించిన సంస్థ..ఆదాయ వృద్ధి అంచనాల్లో కోత విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో వృద్ధి 1-2.5 శాతం మాత్రమే నమోదుకానున్నదని గైడెన్స్‌లో పేర్కొంది. గతంలో 1-3.5 శాతంగా ఉంటుందని అంచనావేసిన విషయం తెలిసిందే. అలాగే ఆపరేటింగ్ మార్జిన్ గైడెన్స్ 20-22 శాతం మధ్యలో నమోదుకానున్నది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతుండటం, విచక్షణ ఖర్చులపై నియంత్రణ పాటిస్తుండటంతో గైడెన్స్‌లో కోత విధించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

#### ఉద్యోగులకు శుభవార్త

ఉద్యోగులకు శుభవార్తను అందించింది ఇన్ఫోసిస్. వచ్చే నెల 1 నుంచి వేతనాలు పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. మరోవైపు ఇన్ఫీ ఉద్యోగుల సంఖ్య క్రమంగా పడిపోతున్నది. సెప్టెంబర్ చివరినాటికి 7,530 తగ్గి 3,28,764కి పడిపోయారు. జూన్ త్రైమాసికం నాటికి 3,36,294 మంది ఉన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 50 వేల మంది ఫ్రెషర్లను నియమించుకున్నది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.18 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. ఈ డివిడెండ్‌ను నవంబర్ 6న చెల్లింపులు జరపనున్నట్టు ప్రకటించింది.



> **గత త్రైమాసికంలో 7.7 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా అనవసరపు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధి అంచనాల్లో కోత విధించడం జరిగింది. టెలికం, హై-టెక్, ఆర్థిక సేవలు(పేమెంట్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్), రిటైల్ వంటి రంగాలు బలహీనంగా ఉండటంతో ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపనున్నది.**
>
> - సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ

# 5 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

## కూరగాయల ధరల తగ్గుదల ప్రభావం



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: కూరగాయల ధరలు తగ్గడంతో సెప్టెంబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం మూడు నెలల కనిష్ఠస్థాయి 5.02 శాతానికి దిగివచ్చింది. కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం అంతక్రితం ఆగస్టు నెలలో 6.83 శాతం కాగా, 2022 సెప్టెంబర్‌లో 7.41 శాతం. గురువారం జాతీయ గణాంకాల శాఖ విడుదల చేసిన డాటా ప్రకారం ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్‌కు 9.94 శాతం నుంచి 6.56 శాతానికి తగ్గింది. ఇందులో వెజిటబుల్ బాస్కెట్ ద్రవ్యోల్బణం గణనీయంగా 26.14 శాతం నుంచి 3.39 శాతానికి దిగింది. ముగిసిన నెలలో పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ధరలు అధికంగా ఉన్నాయి. పట్టణాల్లో 4.65 శాతం, గ్రామాల్లో 5.33 శాతం చొప్పున ద్రవ్యోల్బణం నమోదయ్యింది. ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం సైతం గ్రామీణ ప్రాంతాల్లో 6.65 శాతం కాగా, పట్టణాల్లో ఇది 6.35 శాతం.

#### మళ్లీ పెరుగుతుంది

ద్రవ్యోల్బణం రానున్న నెలల్లో తిరిగి పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ చెప్పారు. రుతుపవనాల అసమానత, కీలకమైన ఖరీఫ్ పంటలైన పప్పు దినుసులు, నూనె గింజల సాగుబడి తగ్గడం, దేశంలోని రిజర్వాయిర్లలో నీటిస్థాయి అంతంతగానే ఉండటం వంటి అంశాల కారణంగా ఆహారోత్పత్తుల ధరలు మళ్లీ పెరగవచ్చని అంచనా వేశారు. వ్యవసాయ దిగుబడి తగ్గనున్నందున, రానున్న నెలల్లో ద్రవ్యోల్బణం అధికమవుతుందని పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్ రానెన్ బెనర్జీ చెప్పారు.

## పెరిగిన పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: భారత్ పారిశ్రామిక రంగం ఆగస్టు నెలలో పుంజుకుంది. గురువారం వెలువడిన అధికారిక గణాంకాల ప్రకారం ఆగస్టు నెలలో పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపీ) వృద్ధి రేటు 14 నెలల గరిష్ఠస్థాయి 10.3 శాతానికి పెరిగింది. తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పనితీరు ఈ వృద్ధికి కారణం. 2022 ఆగస్టులో ఐఐపీ మైనస్ 0.7 శాతం. ఈ ఏడాది జూలైలో పారిశ్రామిక వృద్ధి రేటును 5.7 శాతం నుంచి 6 శాతానికి సవరిస్తున్నట్టు గురువారం జాతీయ గణాంకాల శాఖ తెలిపింది.

**వివిధ రంగాల పనితీరు ఇలా...**

| రంగం | 2023 ఆగస్టు | 2022 ఆగస్టు |
|---|---|---|
| తయారీ | 9.3 శాతం | -0.5 శాతం |
| విద్యుత్ | 15.3 శాతం | 1.4 శాతం |
| మైనింగ్ | 12.3 శాతం | 3.9 శాతం |